ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025



గంజాయిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు..

- కదిరె శ్రీకాంత్‌గౌడ్, ఎస్సై ఇల్లంతకుంట



ఆంధ్రజ్యోతి: మండలంలో గంజాయిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై: మండలంలో గంజాయిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం. గంజాయి సేవించే వారు పెరుగుతున్నారనే సమాచారం మేరకు గ్రామాల్లో కమ్యూనిటీ ప్రోగ్రాంలు ఏర్పాటు చేస్తున్నాం. వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలు పాడుచేసుకోవద్దు.

ఆంధ్రజ్యోతి: మండలంలో చిల్లర దొంగతనాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: ప్రతిరోజు పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు కొంతమంది పోలీసులను దొంగతనాలను అరికట్టడానికి ప్రత్యేకంగా పని చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుకను తరలించాలి. రెవెన్యూ, పోలీస్‌శాఖ ప్రత్యేకంగా నిఘూ ఏర్పాటు చేశాం. పట్టుబడిన వారిని రిమాండ్ చేస్తున్నాం.

- ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి)

ఖజానాకు కళ..

- పన్నుల వసూళ్లలో మరోసారి రికార్డు..
- రాష్ట్రస్థాయిలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమం
- గ్రామపంచాయతీల్లో పన్ను వసూళ్ల లక్ష్యం రూ.7.21 కోట్లు
- ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వసూలు రూ.7.12 కోట్లు...
- మిగిలిన బకాయిలు రూ.9.15 లక్షలు
- రెండు మున్సిపాలిటీల్లో లక్ష్యం రూ.10.39 కోట్లు.. వసూలు రూ.9.60 కోట్లు
- 8 మండలాల్లో వంద శాతం వసూలు పూర్తి



● జిల్లాలో 99 శాతం పూర్తి..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆస్తి పన్నుల వసూలు రికార్డుల్లో మరోసారి రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో 99శాతంతో ప్రథమంగా నిలిచింది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు 260 గ్రామ పంచాయతీల్లో సిబ్బంది పన్నులవసూల్లను లక్ష్యానికి చేరువలో పూర్తి చేయడంతో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల ఖజానా కళకళలాడుతోంది. జిల్లాలో మార్చి31 లోపునే నిర్దేశించిన లక్ష్యంలో 99 శాతం పూర్తిచేశారు. పన్నుల వసూళ్లలో గ్రామ పంచాయతీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానాన్ని దక్కించుకొని ఆదర్శంగా నిలిచింది. గ్రామపంచాయతీ పాలకవర్గాలు లేక పోయినా ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగా ప్రత్యేక దృష్టి పెట్టడం విశేషం.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీల పరిధిలో పన్నుల లక్ష్యాన్ని 99 శాతం పూర్తి చేశారు. జిల్లాలోని 12 మండలాల్లోని గ్రామపంచాయతీల్లో ఆస్తి పన్నుల్లో పాత బకాయిలతో కలిపి రూ.7కోట్ల 21 లక్షల 42 వేల 291 వసూలు లక్ష్యం ఉండగా, రూ.7 కోట్ల 12 లక్షల 27 వేల 901 వసూలు చేశారు. కేవలం రూ.9 లక్షల 15వేల 390 మాత్రమే బకాయిలు ఉన్నాయి. జిల్లాలో 12మండలాల్లో 8మండలాలు వందశాతం వసూలు పూర్తి చేశారు. వందశాతం లక్ష్యం సాధించిన మండలాల్లో చందుర్తి, కోనరావుపేట, ముస్తాబాద్, రుద్రంగి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, వేములవాడ రూరల్ మండలాలు ఉన్నాయి. 99 శాతంలో బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాలు ఉండగా తంగళ్లపల్లి 98శాతం, గంభీరావుపేట 91శాతంతో ఉన్నాయి. పన్నుల వసూళ్లలో బోయినపల్లి మండలంలో 23 గ్రామపంచాయతీల్లో రూ.51,65,364కు రూ.51,18,846 వసూలు చేశారు, చందుర్తి మండలంలో 19 గ్రామపంచాయతీల్లో రూ.49,54,330కు వసూలు రూ.44,96,966, ఇల్లంతకుంట మండలంలో 35 గ్రామపంచాయతీల్లో రూ.53,52,978కు వసూలు రూ.52,74,624 గంభీరావుపేట మండలంలో 22 గ్రామపంచాయతీల్లో రూ.70,02,546కు వసూలు రూ.63,88,255, కోనరావుపేట మండలంలో 28గ్రామ పంచాయతీల్లో రూ.44,82,537కు వసూలు రూ.44,96,966, ముస్తాబాద్ మండలంలో 22 గ్రామపంచాయతీల్లో రూ.1,07,02,265కు వసూలు రూ.1,06,73,103, రుద్రంగి మండలలో పది గ్రామ పంచాయతీల్లో రూ.29,59,690కు వసూలు రూ.29,47,630, తంగళ్లపల్లి మండలంలో 30గ్రామ పంచాయతీల్లో రూ.88,33,109కు వసూలు రూ.86,52,434, వీర్నపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో రూ.18,40,706కు వసూలు రూ.18,42,898, వేములవాడ మండలంలో 11 గ్రామపంచాయతీల్లో రూ.71,70,096కు వసూలు రూ.71,71,250, వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామపంచాయతీల్లో మిగతా 8లో

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

సిరిసిల్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న చిత్రపటానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్న చేసిన సేవలను గుర్తు చేశారు. జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజామనోహర్‌రావు, ఎల్‌డీఎం మల్లికార్జున్, గౌడ సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు బొల్గం నాగరాజు గౌడ్, పులి లక్ష్మీపతిగౌడ్, బండి దేవదాస్, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, బుర్ర నారాయణగౌడ్, నర్సాగౌడ్, అంజయ్య, అనిల్, బండారి శ్రీనివాస్, కార్తీక్, పర్శయ్యగౌడ్, తిరుపతిగౌడ్‌లు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాక

సిరిసిల్ల కలెక్టరేట్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, ఐదుగురు సభ్యులు ఈనెల 3వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్ గురువారం జిల్లాలోని వేములవాడకు సాయంత్రం 6 గంటలకు చేరుకుంటారు. 4వ తేదీన శుక్రవారం ఉదయం 6గంటలకు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి

- బీసీల పోరు గర్జన సభలో ఆది శ్రీనివాస్



బీసీల పోరు గర్జన సభలో పాల్గొన్న ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కుల గణన కార్యక్రమం చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. కుల గణన కార్యక్రమాన్ని దేశమంతా చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీల పోరు గర్జన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సహచర ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలతో కలిసి పోరుగర్జనలో పాల్గొన్న ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కుల గణన కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలలో వెంటనే ప్రవేశపెట్టి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

● సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన బీసీల పోరు గర్జనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశ్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, నాయకులు బచ్చు ప్రసాద్, తిరుపతి, శ్రీకాంత్, వేణు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులకు జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా సోమవారం నిర్వహించిన పరీక్షకు 6767 మంది విద్యార్థులకు 6753మంది విద్యార్థులు హాజరుకాగా 14విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు సహకరించిన ఉపాధ్యాయులతో పాటు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన సిబ్బందితో పాటు సీఎస్‌లు, డీవోలతోపాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు అభినందించారు. బుధవారం బోయిన్‌పల్లి మండలం విలాసాగర్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు సందర్శించి పరిశీలించారు.

కొత్తపల్లిలో కోక్యతండా వాసుల ధర్నా

గంభీరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ వద్ద కోక్యతండా వాసులు బుధవారం ధర్నా చేపట్టారు. తమ తండాకు రోడ్డు సౌకర్యం లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనేకసార్లు పాలకులకు, అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోక్యతండ, టప్పతండా మధ్యలో కిలోమీటరు మేరకు రోడ్డు బాగుచేయిస్తే సమస్య తీరుతుందని పేర్కొన్నారు. ధర్నాలో ఓ వ్యక్తి పెట్రోల్ బాటిల్ పట్టుకుని నిరసన తెలుపడంతో అధికారులు అక్కడికి చేరుకుని సమస్యను ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తండావాసులు శాంతించారు.

ముదిరాజ్ యువజన సంఘ అధ్యక్షుడిగా వరుణ్‌కుమార్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జవారిపేట గ్రామ ముదిరాజ్ యువజన సంఘ అధ్యక్షుడిగా గంగాదర వరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జెట్టి ఆదర్శ్‌కుమార్, కోశాధికారిగా జెట్టి క్రాంతికిరణ్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లక్ష్యం మేరకు చేపట్టాలని హౌజింగ్ ఎండీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌నుంచి మున్సిపాలిటీలలో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, హౌసింగ్ పీడీ శంకర్, డీఈ ఖాజా ముజఫరోద్దీన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ పేదలకు ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ పథకానికి రూపకల్పన చేసిందన్నారు. ప్రణాళిక ప్రకారం ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణాలకు వచ్చిన దరఖాస్తులు, అనుమతి, గ్రౌండింగ్, నిర్మాణాలపై ఆరాతీశారు. జిల్లాలో నియోజకవర్గాని 3500 ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నామని అదనపు కలెక్టర్ వెల్లడించారు. 12 మండలాల్లోని 12 గ్రామాలు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 8 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీగా వ్యవహరించాలి

- ఎస్పీ మహేశ్ బి. గితే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పకడ్బందీగా వ్యవహరించాలని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిరిసిల్ల పోలీస్ సబ్ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 100పై తక్షణమే స్పందిస్తూ సమస్యలు పరిష్కరించాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరిస్తూ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పెండింగ్ కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులు ఛేదించాలన్నారు. పోక్సో ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో మరింత నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. పెండింగ్ ఉన్న కేసులలో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి నిందితులను అరెస్ట్‌చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో అన్ని స్థాయిలకు చెందిన పోలీసు అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. నేరాల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గంజాయి, పేకాట, పీడీఎస్ రైస్, గుడుంబా, ఇతర చట్ట వ్యతిరేకమైన నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి కేసులు నమోదుచేయాలన్నారు. ఇతర చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్‌లు వాహనాలు నడపడం లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, సదన్‌కుమార్, మధుకర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

రాజన్న గోశాలకు ఎండుగడ్డి వితరణ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి గోశాలకు ఐదు ట్రాక్టర్ల ఎండు గడ్డిని వితరణ చేశారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం ఖైలారం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి అనే భక్తుడు రాజన్న కోడెలకు 5 ట్రాక్టర్ల గడ్డిని ఆలయ గోశాల అధికారులకు అందించాడు.

నిబంధనల ప్రకారమే పని చేస్తున్నాం..

- కోర్టు ఆదేశాల మేరకే విద్యుత్ బిల్లింగ్ - సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమనే కాదు.. తాము ఎవరికి వ్యతిరేకం కాదని నిబంధనల ప్రకారమే పనిచేస్తున్నామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం సిరిసిల్ల సెస్ కార్యాలయంలో ఎండీ విజయేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలకు, వినియోగదారులకు వారధిగా సెస్ పనిచేస్తుందని, 50 సంవత్సరాలుగా ఎన్నడూ లేనివిధంగా సెస్‌ను బద్నాం చేస్తున్నారన్నారు. పవర్‌లూం కార్మికులు, యజమానులను ఇబ్బందులకు గురిచేయడం లేదన్నారు. హైకోర్టు అదేశాల మేరకు ముందుకువెళుతున్నామని అన్నారు. సెస్‌కు రూ 162 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నా ఎవరిపై ఒత్తిడి చేయడం లేదన్నారు. సిరిసిల్లలో 127ఎస్ఎస్ఐ యూనిట్లు నడుస్తున్నాయని వీటికి సంబంధించి విద్యుత్ వాడకంపై కొందరు హైకోర్టును ఆశ్రయించడం వల్ల బ్యాక్ బిల్లింగ్ చేయడం జరిగిందన్నారు. బ్యాక్ బిల్లింగ్ ఉన్నా రెగ్యులర్ బిల్లులు చెల్లించాలని కోరినా చెల్లించకపోవడంతోనే విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. పూర్తిగా పరిశ్రమలకు కరెంట్ నిలిపివేశారనే ప్రచారం చేస్తున్నారన్నారు. సిరిసిల్లలో 2964 పరిశ్రమలు కొనసాగుతున్నాయన్నారు. బిల్లింగ్ విషయంలో కొందరు పాలకవర్గాలను బెదిరింపులకు కూడా గురిచేస్తున్నారన్నారు. తాము నిబంధనల ప్రకారం పనిచేస్తున్నామని, ఎవరి మీద ఒత్తిడి చేయడం లేదన్నారు. కొందరు సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో కలపాలని డిమాండ్ చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. పవర్‌లూం పరిశ్రమకు రాయితీలో 30 హెచ్‌పీలకు విద్యుత్ వాడకాన్ని పెంచాలని కోరగా, దాని ప్రకారం 25హెచ్‌పీల వరకు పెంచారని గుర్తుచేశారు. ఎన్‌పీడీసీఎల్ కంటే మెరుగ్గా సెస్ పనిచేస్తుందన్నారు. సెస్ ఎండీ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్లలో పవర్‌లూం పరిశ్రమకు 2001లో ఐదు హెచ్‌పీల లోడ్‌తో 50శాతం రాయితీ జీవో అప్పటి ప్రభుత్వం ఇచ్చిందని, దానిని పది హెచ్‌పీలకు పెంచామన్నారు. పది హెచ్‌పీల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న పరిశ్రమలను 4వ కేటగిరీ నుంచి మూడవ కేటగిరీకి మార్చామన్నారు. 127ఎస్ఎస్ఐ యూనిట్లకు బ్యాక్ బిల్లింగ్ నోటీసులు జారీ చేశామన్నారు. పవర్‌లూం యజమానులు కోరిన మేరకు రెగ్యులర్ బిల్లు చెల్లింపుపై చర్చలు కూడా జరిగాయన్నారు. ఎస్ఎస్ఐ యూనిట్లు ఒప్పందాల ప్రకారం రెగ్యులర్ బిల్లు కూడా చెల్లించలేదన్నారు. 127 ఎస్ఎస్ఐ యూనిట్లు 744 సర్వీసులకు సంబంధించి రూ 31.94 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. తాము హైకోర్టు నిబంధనల ప్రకారం బిల్లింగ్ చేశామన్నారు.

ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, సందుపట్ల అంజిరెడ్డి, కోట్టెపల్లి సుధాకర్, అకుల గంగారాం, రేగులపాటి హరిచరణ్‌రావు, వరుస కృష్ణహరి, మాడుగుల మల్లేశం, గౌరీనేని నారాయణరావు, ఆకుల దేవరాజం, మల్లుగారి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటిలు, ఇతర కార్యవర్గం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలో కోర్టు నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నిస్తానన్నారు. న్యాయవాదులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెన్నంటి ఉంటామన్నారు. ప్రతి న్యాయవాదికి ఆరోగ్య బీమా వర్తించే విధంగా కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి సత్యనారాయణరావు ప్రమాణస్వీకారం చేయించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, కోశాధికారి వేముల నరేశ్, సంయుక్త కార్యదర్శి గాజుల రాజమల్లు, క్రీడలు,సాంస్కృతిక కార్యదర్శి నరిమెట్ల నరేశ్, గ్రంథాలయ కార్యదర్శి శరత్‌కుమార్, మహిళా ప్రతినిధి పుష్పలత, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుతో బార్ సీజ్ తొలగింపు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు తీర్పుతో సిరిసిల్ల పట్టణంలోని చిత్ర బార్ అండ్ రెస్టారెంట్ సీజ్‌ను బుధవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. జనవరి 29న మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ రూ.42వేలు చెల్లించలేదని అప్పటి కమిషనర్ లావణ్య బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కుమారుడికి చెందిన బార్‌అండ్‌రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. దీంతో జనవరి 31న వారు హైకోర్టును ఆశ్రయించగా, సీజ్‌ను తొలగించాలని కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినా అప్పటి మున్సిపల్ కమిషనర్ సీజ్ తొలగించలేదు. కలెక్టర్ నుంచి ఆదేశాలు రావాలంటూ దాట వేయడంతో బార్ యజమాని సీజ్ తొలగించడం లేదంటూ తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు సీజ్ తొలగించి ఫొటోలు పెట్టాలని లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకుంటామని తీర్పునిచ్చింది. దీంతో హుటాహుటిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సిబ్బందితో బార్ అండ్ రెస్టారెంట్ సీజ్‌ను తొలగించారు.

రెండో రోజుకు చేరిన మరమగ్గాల కార్మికుల సమ్మె

- సిరిసిల్లలో బైక్‌ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మరమగ్గాలతో పాటు అనుబంధ రంగాల కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. దీంతో బుధవారం పట్టణంలోని బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి మరమగ్గా కార్మికులతో నాయకులు బైక్ ర్యాలీని చేపట్టారు. పట్టణంలోని అన్ని చౌరస్తాల గుండా చేపట్టిన బైక్ ర్యాలీతో సిరిసిల్ల కలెక్టరేట్ వరకు చేరుకుని ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్‌లు మాట్లాడుతూ సిరిసిల్లలో మర మగ్గాల అనుబంధ రంగాల కార్మికులకు కూలి పెంచడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించే విధంగా కలెక్టర్ స్పందించాలన్నారు. పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండు రమేష్, నాయకులు ఉడుత రవి, సబ్బని చంద్రకాంత్, బాస శ్రీధర్, శ్రీకాంత్, సదానందం, వేణు, తిరుపతి, వెంకటేశ్వర్లు, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


మధు (ఫైల్)

ఇల్లందకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన వంగ మధు(28) అనే కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధు చిన్న వయస్సులోనే తల్లి చనిపోగా, తండ్రి ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. మధు గ్రామంలో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంటను సాగుచేశాడు. ఈ క్రమంలో మొక్కజొన్న లాభసాటిగా దిగు బడి రాకపోగా, సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో మనస్థాపం చెందిన మధు ఆదివారం ఇల్లందకుంట శివారులోని ఎర్ర గుట్టల సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు.

బావిలో పడి రైతు మృతి


దేవయ్య (ఫైల్)

గంబీరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గంబీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతిచెందాడు. చివరి దశలో ఎండుతున్న పంటను కాపాడుకోవటానికి ఓ రైతు తన బావిలో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. పనులను చూసేందుకు తాడు సహాయంతో బావిలోకి దిగుతుండగా రైతు ప్రమాదవశాత్తు జారిపడటంతో మృతిచెందాడు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శివంది దేవయ్య (45) తనకున్న 3 ఎకరాల పొలంలో వరి పంట వేశాడు. తన వ్యవసాయ బావిలో నీరు ఇంకిపోతుండటంతో మూడు రోజుల క్రితం క్రేన్‌తో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. తాడు సహాయంతో రైతు దేవయ్య బుధవారం బావిలోకి దిగుతున్న క్రమంలో జారిపడ్డాడు. తీవ్రగాయాల పాలైన దేవయ్యను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే రైతు దేవయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


సరోజన(ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చందుర్తి మండలకేంద్రానికి చెందిన చింతపల్లి సరోజన(78)అనే వృద్ధురాలు బుధవారం మృతిచెందింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. సరోజన గత మార్చి 31న తన కుమారుడైన వెంకటేశ్వర్‌రావుతో ద్విచక్రవాహనంపై చందుర్తి నుంచి వేములవాడకు వెళ్తుండుగా మండలకేంద్రం శివారులో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సరోజన తలకు బలమైన దెబ్బ తగలడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై మృతురాలి బంధువు కారంగుల మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. మృతిరాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామ సమీపంలో కారు ఢీకొని అదే గ్రామానికి చెందిన లెక్కల లింగన్న (65) అనే వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. లింగన్న నేరెళ్ల వద్ద బీటు వద్ద పనులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా జగిత్యాల వైపు నుంచి ధర్మపురి వెళ్తున్న కారు టీఎస్ 10ఈఈ 8668 డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడిపినవ్యక్తి హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన రాపర్తి వెంకటేష్‌గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ


ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న పగిడిమర్రి సోలోమన్

భగత్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీజోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌గా పగిడిమర్రి సోలోమన్ బుధవారం బస్టాండ్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు బీవీ రావు, భూపతిరెడ్డి, డిప్యూటీ పర్సనల్‌మేనేజర్ విలాస్‌రెడ్డి, జోనల్ పర్సనల్ మేనేజర్ విలాస్ రెడ్డి, సుగుణాకర్, సీనియర్ మెడికల్‌ఆఫీసర్ గిరిసింహారావు శుభకాంక్షలు తెలిపారు.

● కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేసి హైదరాబాద్ బదిలీపై వెళ్తున్న ఖుస్రోషాఖాన్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈడీ సోలోమన్‌కు టీజీఎస్‌ఆర్టీసీ ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు.

పొద్దు తిరుగుడు కొనేదెవ్వడు?


ముస్కానిపేట గ్రామంలో కల్లాల వద్ద ఆరబోసిన పొద్దుతిరుగుడు గింజలు

● కొనుగోలు కేంద్రాలు లేక రైతుల ఇబ్బందులు
● దళారీల బారినపడి నష్టపోతున్న వైనం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పొద్దుతిరుగుడు రైతులు దళారీల బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ముస్కానిపేట, కేసన్నపల్లె, గాలిపెల్లి, తాళ్లపెల్లి, పత్తికుంటపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాలలో రైతులు పొద్దుతిరుగుడు పంటను ఈ సంవత్సరం సాగుచేశారు. విత్తనాల ధరకు తోడు కూలీల ధరలు పెరగడంతో గతంలో కంటే పొద్దుతిరుగుడు సాగుచేయడానికి పెద్దమొత్తంలో రైతులు వెచ్చించారు. పంటచేతికి అందివచ్చే దశలో బావులు, బోర్లలో నీరు తగ్గడంతో నానా ఇబ్బందులు పడి పంటను కాపాడుకున్నారు. పొద్దుతిరుగుడు పంటను కోసి నెల రోజులు కావస్తోంది. పొదుతిరుగుడు పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రం లేదు. సిద్దిపేట, బెజ్జంకిలో మాత్రమే ఉండడంతో అక్కడికి అమ్ముదామనుకుంటే ఈప్రాంత రైతుల పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాలుకు రూ.7280 చెల్లిస్తుండగా దళారులు రూ.5500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన కొంతమంది దళారులు ఇక్కడ రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటను కొంతమంది రైతులు తక్కువ ధరకు అమ్మలేక, వ్యవసాయ బావుల వద్ద కల్లాల్లోనే ఉంచుకుంటున్నారు. వర్షాలు పడితే ఎక్కడ పంట తడుస్తుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది..

బట్టు సుధాకర్, రైతు గాలిపెల్లి



పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. భూగర్భజలాలు తగ్గడంతో కొంతమేర ఎండిపోయింది. సిద్దిపేట, బెజ్జంకి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని పోయినా పట్టాదారు పాసుపుస్తకాలు చూసి తమ ప్రాంతానివి కావని తిప్పి పంపుతున్నారు. ఆరు ఎకరాలలో పంటను సాగుచేశాను. పంటను కోసి నెల రోజులు అవుతోంది. ప్రభుత్వం వెం టనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

త్వరలో సమస్య పరిష్కారం..

సురేష్‌రెడ్డి, ఇల్లంతకుంట వ్యవసాయాధికారి



పొద్దుతిరుగుడు రైతుల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకపోయాం. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకపోతే టోకన్లు జారీచేస్తాం. రైతులు తొందరపడి దళారులకు అమ్మి నష్టపోవద్దు. పంటను కల్లాల వద్ద జాగ్రత్తగా కాపాడాలి.



మోటార్ సైకిల్‌ను ఢీకొన్న రెండు కార్లు

● ఇద్దరికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విఠల్, అవినాష్

మానకొండూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామశివారులో మోటార్‌సైకిల్‌ను రెండుకార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన విఠల్ (18), అవినాష్ (18) అనే ఇంటర్ విద్యార్థులు మోటార్ సైకిల్‌లో పెట్రోల్ పోసుకునేందుకు బంక్‌కు వచ్చి తిరిగివెల్లుతున్నారు. జమ్మికుంట నుంచి కరీంనగర్ వైపు వెల్లుతున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొంది. అదే సమయంలో కరీంనగర్ నుంచి పచ్చునూర్ వైపు వెల్లుతున్న మరో కారు అదే మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పందుల చోరీ

సుల్తానాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని రైస్ మిల్లులప్రాంతంలో కొందరు గుర్తు తెలియని దొంగలు మందలో ఉన్న పందులను ఎత్తుకెళ్లారు. మానుపాటి ఈదయ్యకు చెందిన 32 పందులను ఒక చోట మందగా ఏర్పాటుచేసి అందులో ఉంచగా బుధవారం ఉదయంలేచి చూసేసరికి మందలో పందులు మాయంఅయ్యాయి. దాంతో బాధితులు వెంటనేపోలీసులను ఆశ్రయించారు. సమీపంలోని రైస్‌మిల్లు అసోషియేషన్ కార్యాలయంలోఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించగా ముగ్గరు వ్యక్తులు ఒకబైక్‌పై ముందు వెళ్తుండగా మరోట్రాలీలో పందులను తీసుకువెళ్తున్నట్లు కనిపించింది. దాదాపు 2లక్షల రూపాయల విలువ ఉంటాయని బాధితులు తెలిపారు.

అనుమతి లేకుండా రోడ్డుపై వార్షికోత్సవం

● పాఠశాలపై కేసు నమోదు

ముస్తాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవాణి ప్రైవేట్ పాఠశాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డుపై నిర్వహించడంతో వాహనదారులకు ఇబ్బందులు కలిగించారని పాఠశాల యాజమాన్యంతోపాటు, ఆర్గనైజర్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెలిచాల గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం


వెలిచాల గ్రామ పంచాయతీ ఆవరణలో కేంద్ర బృందం

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామాన్ని కేంద్ర తాగునీరు, పారిశుధ్య ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. స్వచ్ఛభారత్ మిషన్ ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామంగా ప్రకటించుకొని గ్రామంలోని పారిశుధ్య వసతులను, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, మురికినీటి నిర్వహణ, డ్రైనేజీ గుంత వాడకం, తదితర అంశాల సుస్థిరతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందంలో డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్, కన్సల్టెంట్ జైపాల్ దక్ష, స్వచ్ఛ భారత్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ సురేష్ బాబు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాశ్ కిరణ్, ఎంపీడీవో రాజేశ్వరి, పంచాయతీ అధికారి శ్రవణ్, గ్రామప్రత్యేక అధికారి, ఏపీవో రాధ, ఏపీఎం ప్రభాకర్, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు రమేష్, వేణు, యూనిసెఫ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కిషన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు


గాయపడ్డ తిరుపతి

ధర్మారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గ్రామానికి చెందిన పల్లె తిరుపతి వృత్తిరీత్యా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. తిరుపతి పరిస్థితి విషమించడంతో అతన్ని స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

అజాగ్రత్తగా బైక్ నడిపిన బాలుడిపై కేసు

చందుర్తి, ఏప్రిల్ 2, (ఆంధ్ర జ్యోతి): అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి ఆటోను ఢీకొట్టిన సంఘటనలో బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన మల్యాల జాషువా(17) అనేబాలుడు ద్విచక్ర వాహనంపై బండపల్లి నుంచి వేములవాడ వైపు వెళుతుండగా, వేములవాడ నుంచి బావుసాయిపేట వైపు వస్తున్న ఆటోను ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి జంగం జాన్‌కు గాయాలయ్యాయి. జంగం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాషువాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై కేసు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడం, దహనం చేయడంపై యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫాహద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ అమీర్ డీసీసీ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ క్రమంలో జిల్లా నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు యువజన కాంగ్రెస్ నాయకుడు ఫాహద్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించి వేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి అజీం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తగలబెట్టారు. కొందరు కాంగ్రెస్ నాయకులే తమ ఫ్లెక్సీలను ధ్వంసం చేసినట్లు అనుమానంగా ఉందని ఫాహద్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మెట్‌పల్లి పట్టణంలో చోరీ

● 13 తులాల బంగారం, 20 తులాల వెండి అపహరణ

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిపట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో బుధవారం దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 13 తులాల బంగారం, 20తులాల వెండి ఎత్తుకెళ్లారు. మెట్‌పల్లి ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సాయిరాంనగర్ కాలనీకి చెందిన ఎల్దాస్ శ్యామల అనే ఉద్యోగి తన బంధువుల దగ్గరికివెళ్లి తిరిగి బుధవారం సాయంత్రం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 13 తులాల బంగారం, 20తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్‌లు పరిశీలించి క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఖననం చేసిన చిన్నారి మృతదేహం వెలికితీత

● మేజిస్ట్రేట్ సమక్షంలో పోస్టుమార్టం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పసికందు మృతికి రెండు ప్రైవేటు హాస్పిటల్స్ కారణమని తల్లిదండ్రుల ఫిర్యాదు చేయడంతో ఖననం చేసిన మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికితీశారు. వివరాల్లోకి వెళితే.. ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గండి గీతాంజలికి గతనెల 18వ తేదీన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించాడు. పుట్టిన తర్వాత శిశువు ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో కరీంనగర్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. తరలించిన గంటల వ్యవధిలో పసికందు మృతిచెందాడు. మృతదేహాన్ని ఫాజుల్‌నగర్ గ్రామంలో పూడ్చారు. అయితే తమ కొడుకు మృతికి కరీంనగర్‌లోని రెండు ప్రైవేటు ఆసుపత్రులే కారణమని రాజశేఖర్-గీతాంజలి దంపతులు కరీంనగర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సైలు దీపక్, చంద్రశేఖర్‌లు చిన్నారిని పూడ్చిపెట్టిన ఫాజుల్‌నగర్ గ్రామానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఖననం చేసిన చిన్నారి మృతదేహాన్ని మండల మెజిస్ట్రేట్ అబుబాకర్ సమక్షంలో వెలికితీసి ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రణతిరెడ్డి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో బుధవానం కారు ఢీకొని కుర్మదాస్, వినయ్, ప్రేమ్‌దాస్ అనే ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. గునిశెట్టి సంతోష్ అనే వ్యక్తి జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం కారు నేర్చుకుంటున్నాడు. అదే సమయంలో జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పురుషుల డిగ్రీకళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వాకింగ్ చేస్తున్నారు. సంతోష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ముగ్గురు విద్యార్థులను ఢీకొట్టడంతో ఆసిఫాబాద్‌కు చెందిన కుర్మదాస్ అనే విద్యార్థికి రెండు కాళ్ల ఫ్రాక్చర్ అయ్యాయి. మరో ఇద్దరు విద్యార్థులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను వెంటనే చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైస్‌ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

కిష్టంపల్లిలో ప్రభుత్వభూమి కబ్జాకు యత్నం

● కాపాడేందుకు విగ్రహాల ప్రతిష్ఠ


కిష్టంపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని వెంకట్రావుపల్లె పరిధిలోని కిష్టంపల్లిలో ఓవ్యక్తి ప్రభుత్వభూమి కబ్జా చేసేందుకు యత్నించగా గ్రామస్థులందరు కలిసి దేవతా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గ్రామస్తులకథనం ప్రకారం.. గ్రామం లోని 674సర్వే నంబర్‌లో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిఉంది. ఈభూమిని లక్ష్మీ పూర్ పంపుహౌజ్ నిర్మాణం జరిగిన సమ యంలో మెగా కంపెనీ ఈ భూమిలో మట్టిని పోసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందింది. అయితే ఈ భూమి తనకు సంబంధించినదని ఓవ్యక్తి చదును చేస్తున్న సమయంలో గ్రామస్థులు ఆయనను అడ్డుకున్నారు. ఈ ఘటనలో స్థానిక సదరువ్యక్తి ఫిర్యాదు చేయడంతో 42మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన ఇలా ఉండగా నాలుగురోజుల క్రితం మళ్లీ భూమిని కైవసం చేసుకోవడానికి ప్రయత్నించడంతో గ్రామస్థులంతా కలిసి అదే స్థలంలో శివలింగం నంది విగ్రహాలను నెలకొల్పారు. దీంతోగ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సమస్య పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది.

దీంతో రూరల్ ఏసీపీ కరుణాకర్ గ్రామానికి వచ్చి పరిశీలించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. కాగా భూమి సదరు వ్యక్తికి సంబంధించిందాలేదా ప్రభుత్వానిదా అనేది తేలాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుల రిమాండ్

● పది నెలల తర్వాత గుర్తింపు


మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదినెలల క్రితం బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద జరిగిన అంకం లక్ష్మీనారాయణ(55) అనే వ్యక్తి హత్యకేసులో నిందితులను బుధవారం గుర్తించి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను జగిత్యాలలో బుధవారం డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం జూన్ 14న బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద ఒక గుర్తు తెలియనివ్యక్తిని పెట్రోల్‌పోసి కాల్చి చంపారని అప్పటి కార్యదర్శి పుర్రె చిన్న నర్సయ్య బీర్‌పూర్ పోలీస్ సేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుడి భార్య అంకం అరుణ, చిన్నకుమారుడు అంకం సాయికుమార్‌లకు లక్ష్మీనారాయణ మృతదేహం చూపించారు. వారు ఆ మృతదేహం తమ వారిది కాదని వదిలేసి వెళ్లారు. ఆ తరువాత మృతుడి యొక్క ఎముక భాగాలను డీఎన్‌ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. చనిపోయిన వ్యక్తి నర్సింహులపల్లికి చెందిన అంకం లక్ష్మీనారాయణగా గుర్తించి విషయాన్ని భార్య, కుమారుడికి తెలియజేయగా వారిలో ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో మృతుడిభార్య అరుణ, కుమారుడు సాయికుమార్ మీద అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా మొదట్లో నేరాన్ని అంగీకరించలేదు. దీంతో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం పాలిగ్రాఫ్(లైడిటెక్టర్) టెస్టుకు మృతుడి కుమారుడు, భార్యను పంపించామని డీఎస్పీతెలిపారు. దాంట్లో అంకం లక్ష్మీనారాయణను హత్యచేసింది వారేనని నిర్ధారించుకొని నిందితులను అదుపులోనికి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసిన జగిత్యాల రూరల్ సీఐకృష్ణారెడ్డిని డీఎస్పీ అభినందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో కోర్టుకు మంత్రి శ్రీధర్‌బాబు


నాంపల్లి కోర్టు విచారణకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేసినందుకు అప్పటి బీఆర్‌ఎస్‌ప్రభుత్వం నమోదు చేసిన కేసులో మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. 2017లో బసంత్‌నగర్ పోలీసులు మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు హర్కాల వేణుగోపాల్, అన్నయ్యగౌడ్, శశిభూషణ్‌కాచేతోపాటు మరో 9 మందిపై కేసులు నమోదుచేశారు. విచారణలో భాగంగా వారు కోర్టుకు హాజరయ్యారు. శాంతియుతంగా ఆందోళన చేసినా అప్పటి ప్రభుత్వం తమపై ఐపీసీ 147, 353, 427 రెడ్‌విత్149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వారు వాపోయారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో యూనివర్సిటీల భూములు కబ్జా



ఎస్‌యూలో బంద్ పాటించి నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యూనివర్సిటీల భూములు కబ్జాకు గురవుతున్నాయని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు ప్రజలు ప్రశాంతంగా జీవించలేకపోతున్నార న్నారు. విద్యార్థులకు ఉపయోగపడే బయోడైవర్సిటీ యూనివర్సిటీ 100 ఎకరాలను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు విద్యార్థులు నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం 400 ఎకరాల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని వెంచర్లు చేసి సొమ్ము చేసుకోవాలని చూస్తోందన్నారు. ఇక్కడ ఎన్నో రకాల పక్షులు, జంతువులు జీవిస్తున్నాయని, వాటి ప్రాణాలు తీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో భూముల కోసం విద్యార్థులు ధర్నా చేస్తుంటే లాఠిచార్జి సిగ్గుమాలిన చర్యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మాలని చూస్తున్న భూములను వెంటనే యూనివర్సిటీ కేటాయించాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసులను ఎత్తివేయాలని, లేని పక్షంలో సెక్రెటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు కిరణ్మయి, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, యూనివర్సిటీ అధ్యక్షులు బాలకృష్ణ, కార్యకర్తలు సాయి, అనూష, గౌరీ, ప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందాన్ని ఆహ్వానిస్తున్న అధికారులు

కోనరావుపేట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో జలశక్తి స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం అధికారులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు, కంపోస్ట్ షెడ్‌లను మర్తన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్యం, తాగునీటి వంటి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్ సెక్షన్ ఆఫీసర్ నితిన్‌తో పాటు సెంట్రల్ టీం వర్మ జైపాల్ సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును ఉపసంహరించాలి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని టీ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా విడదీయడం అసమంజ సమని ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును గుర్తు చేశారు. ఈ సవరణ బిల్లు సుప్రీం తీర్పును నిర్వీర్యం చేసేలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ పీసీ హన్మంత్, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్‌రావు, ఎండీ యాకుబ్, పూసల అశోక్‌రావు, డిండిగాల విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రిబ్బన్‌కు ఓ ప్రత్యేకత



మీకు తెలుసా..

ఒక్కో సందర్భానికి ఒక్కో రంగు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏవైనా నిరసనలు జరుగుతున్నప్పుడు అందులో పాల్గొన్న వారు నల్ల రంగు రిబ్బన్లు ధరిస్తారు. మహిళల ఆరోగ్యం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తే గులాబీ రంగు రిబ్బన్లు ధరిస్తారు.. సందేహాలకు, సంతాపాలకు, నిరసనలకు, అవగాహనకు ఒక్కో సందర్భానికి ఒక్కో రిబ్బన్ వాడుతుంటారు. కొన్ని రకాల వ్యాధులు, వాటి పేరుకంటే కూడా రిబ్బన్ సింబల్ నే పాపులర్ అయ్యాయి. ఆ సింబల్ చూడగానే వ్యాధిపై అవగాహనకు వచ్చేస్తాం. రిబ్బన్లతో రకరకాల రంగులు నలుపు, తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు ఇలా ఒక్కో రంగు ఒక్కో అంశాన్ని తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఏ రంగు రిబ్బను ఏం అంశాన్ని సూచిస్తుందో తెలుసుకుందాం.

18 రకాల రిబ్బన్లు

మానవ శరీరంలో వివిధ అవయవాలకు సోకిన క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు 18 రకాల రిబ్బన్లను ఉపయోగిస్తారు. క్యాన్సర్ వ్యాధి సోకడానికి కారణాలు, వాటి లక్షణాలు, ట్రీట్మెంట్ విధానం ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు వీటిని ధరిస్తారు.



నల్ల రంగు..

తమ డిమాండ్లను తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేసినప్పుడు నలుపు రంగు రిబ్బన్ ధరిస్తారు. మృతిచెందిన వారికి సంతాప సూచకంగా నివాళి అర్పించే సమయంలోనూ వీటిని ధరిస్తారు.

ఎరుపు రంగు

ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్, గుండె జబ్బులు, వ్యసనాలు, విపత్తుల సందర్భంగా నిర్వహించే సమావేశాల్లో ఎరుపు రంగు రిబ్బన్‌ను ధరిస్తారు. అత్యవసర పరిస్థితులకూ దీనిని ఉపయోగిస్తారు.

నీలం రంగు

నీలం రంగు రిబ్బన్‌ను 100కు పైగా సందర్భాల్లో ఉపయోగిస్తారు. ప్రధానంగా మానవ అక్రమరవాణా, బెదిరింపులకు వ్యతిరేకంగా వీటిని ఉపయోగిస్తారు. జల సంరక్షణపై అవగాహన కల్పించే సమయంలోనూ నీలం రంగు రిబ్బన్‌ను వాడతారు.

తెల్ల రంగు

గర్భిణులు,మహిళలపై దాడులు జరిగినప్పుడు వాటికి వ్యతిరేకంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో తెల్ల రంగు రిబ్బన్ ధరిస్తారు. సురక్షిత మాతృత్వం, శాంతి, అహింసలను తెలుపుతూ జరిగే కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తారు.

ఆకుపచ్చ రంగు

మూత్రపిండాలు, కాలేయం, అవయవ దానం, సురక్షిత డ్రైవింగ్ పై అవగాహన కల్పించేందుకు ఆకు పచ్చ రంగు రిబ్బన్‌ను ఉపయోగిస్తారు. గ్లోబల్ వార్మింగ్‌పై సమావేశాల్లో ఈ రంగు రిబ్బన్‌ను వాడతారు.

పసుపు రంగు

యుద్ధ ఖైదీలు, తప్పిపోయిన వారి కోసం ఏర్పాటు చేసిన సమా వేశాల్లో పసుపురంగు రిబ్బన్ ను ధరిస్తారు. ఆత్మహత్యల నివారణకు, ఎముకల క్యాన్సర్ తదితర వాటి గురించి నిర్వహించే అవగాహన సదస్సులో వీటిని ఉపయోగిస్తారు.

గులాబీ రంగు

గులాబీ రంగు రిబ్బన్ మహిళల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను సూచిస్తుంది. ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు దీనిని అంతర్జాతీయ గుర్తుగా ఉపయోగిస్తారు.



కొండగట్టులో హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లు

మల్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే హనుమాన్ చిన్న జయంతి కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భక్తుల మాల విరమణ కోసం కల్యాణకట్ట వద్ద బారికేడ్లు, వాటి పై నుంచి భక్తులు కంపార్టుమెంట్లలోకి దూకకుండా పోలీసుల సూచనలతో ఈసారి కొత్తగా జాలీలు ఏర్పాటు చేస్తున్నారు. చలువ పందిళ్ల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా దిగువ కొండగట్టు, దొంగలమర్రి



మాల విరమణ ప్రదేశంలో బారికేడ్లు కడుతున్న సిబ్బంది

వద్ద దేవస్థానం తరఫున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు, ఇతర ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, మల్యాల సీఐ నీలం రవి, అధికారులతో కలిసి పరిశీలించారు. కేవలం దర్శనాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ఈసారి ప్రత్యేక దారి ఏర్పాటు చేయనున్నారు.

రేపు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించి తగు సూచనలు చేయనున్నారు.

త్వరలో రిజర్వాయర్లలో పూడికతీత పనులు



కొత్తపల్లిలో మోయతుమ్మెద వాగు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ పెద్ది రమేష్, అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం ప్రకారం త్వరలో దిగువ మానేరు జలాశయం, మిడ్ మానేరు జలాశయం, కడెం ప్రాజెక్టులకు సంబంధించి పూడికతీత పనులను ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్‌శాఖ, సర్కిల్-2, ఎస్ఈ పెద్ది రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల మోయ తుమ్మెద వాగును, కొత్తపల్లి శివారులోని ఎస్ఆర్ఎస్పీ భూములను రెవెన్యూ, ఇతర ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులతో కలిసి ఎస్ఈ రమేష్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎండీ, ఎంఎంఆర్, కడెం రిజర్వాయర్‌లలో పూడికతీతకు సంబంధించి అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సుమారు 1453కోట్ల వ్యయంతో 20సంవత్సరాలకు సంబంధించి బాంబెకు చెందిన ఈథర్ ట్రినిటీ సహారా కన్సార్టియం కంపెనీ టెండర్లలో ఈ పనులను దక్కించుకుందని తెలిపారు. నెల వరకు పూడికతీత పనులు ప్రారంభం ఆయ్యే అవకాశం ఉంది. పనులు ప్రారంభించే ముందు రిజర్వాయర్ నుంచి తీసిన ఇసుకను ఎక్కడ డంప్‌చేయాలి, కంపెనీ నిర్వాహకులకు సంబంధించి కార్యాలయం ఏర్పాటు, వేబ్రిడ్జ్ ఏర్పాటు, పనులు చేసే సిబ్బంది, లేబర్ ఉండేందుకు, మిషనరీల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. ఎస్సారెస్పీ స్థలాన్ని కూడా గుర్తించామని తెలిపారు. రిజర్వాయర్‌లలో పూడికతీత వల్ల నీటి నిల్వ 3.9 టీఎంసీ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అదే విధంగా పూడికతీత వల్ల వచ్చే ఇసుకను సంబంధిత కాంట్రాక్టర్ ప్రభుత్వానికి టన్నుకు 406.64 రూపాయలు చెల్లించి ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుందని అన్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం చేకురుతుందన్నారు. గతంలో రిజర్వాయర్‌ల కోసం డబ్బులు చెల్లించి పనులు చేయించేవారు కానీ ప్రస్తుతం రెండు ప్రయోజనాలు వస్తుండటంతో ప్రభుత్వం ముందు ఈ మూడు రిజర్వాయర్‌లలో పూడికతీతపై పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుందన్నారు. ఇది విజయవంతమైతే మిగతా ప్రాజెక్టులలో కూడా ఇలాంటి ప్రయోగం చేసే అవకాశాలు లేకపోలేదని ఎస్ఈ పెద్ది రమేష్ తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇరిగేషన్‌శాఖ ఈఈ నాగభూషణ్ రావు, ఏజెన్సీ పర్సన్ సతీష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి రథోత్సవం..



రథంపై స్వామివారి ఊరేగింపు

వేములవాడ కల్చరల్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని రాములవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవమూర్తులను హంసవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

రాజన్న సేవలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారుల బృందం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారులు బుధవారం దర్శించుకున్నారు. గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ పరిశీలనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చిన బృందం సభ్యులు రాజన్నను దర్శించుకొని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అధికారుల బృందానికి ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరేందర్‌లు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న అధికారుల బృందం

జాతీయ సీనియర్స్ ఖో-ఖో జట్లకు కోచ్‌లుగా ఉమ్మడి జిల్లా వాసులు



పండుగ ఆనంద్ కుమార్



ఇస్లావత్ నరేష్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని పూరీలో నిర్వహిస్తున్న 57వ సీనియర్స్ జాతీయ ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లావాసులు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టుకు ఇల్లంతకుంటకు చెందిన రైల్వే క్రీడాకారుడు పూర్వ భారత జట్టు కెప్టెన్ పండుగ ఆనంద్, భారత పురుషుల రైల్వే జట్టుకు ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారుడు ఇస్లావత్ నరేష్ కోచ్‌గా వ్యవహరిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్, నరేష్‌ను రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి, జిల్లా ఖో-ఖో సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, సంఘం బాధ్యులు అభినందించారు.

ఎన్టీపీసీ నిర్మాణాలపై కార్పొరేషన్ కొరడా



- నోటీసులకు స్పందించని ఎన్టీపీసీ యాజమాన్యం
- రూ.99 కోట్ల అపరాధ రుసుం విధించిన కార్పొరేషన్

కోల్‌సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ అక్రమ నిర్మాణాలపై రామగుండం నగరపాలక సంస్థ కొరడా ఝుళిపించింది. కార్పొరేషన్ అనుమతులు లేకుండా ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో నిర్మాణాలు జరిపి కార్పొరేషన్ నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు రూ.99,28,29,548 అపరాధ రుసుం విధించినట్లు కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో గత ఏడాది భారీ నిర్మాణాలు చేపట్టింది. మొత్తం 12రకాల నిర్మాణాలను చేపట్టారు. సీ టైపు, బీ టైపుల్లో అపార్ట్‌మెంట్ టవర్లు, సీఐఎస్ఎఫ్‌కు సంబంధించిన బిల్డింగ్‌లు, హెచ్‌ఓడీ బిల్డింగ్, డీ టైపు బిల్డింగ్‌లు, వీఐపీ గెస్ట్ హౌస్, బ్యాచ్‌లర్ హాస్టల్, ఏసీ రెస్టారెంట్, కమ్యూనిటీ సెంటర్ తదితర భవనాలను నిర్మించింది.

ఈ భవనాలకు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. దీంతో ఏప్రిల్ 22, 2024న 'ఆంధ్రజ్యోతి'లో 'రామగుండంలో అనుమతి లేకుండానే భారీ కట్టడాలు' శీర్షికన కథనం ప్రచురిత మైంది. భవన నిర్మాణాలు పూర్తవుతున్నా అనుమతు లు తీసుకోకపోవడంతో రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్, జిల్లా యంత్రాంగం సీరియస్‌గా స్పందించారు. ఎన్టీపీసీ యాజమాన్యం చట్ట ప్రకారం మెదలాలని, వెంటనే అనుమ తులు తీసుకోవాలని సూచించారు. దీంతో మొత్తం 12 నిర్మాణా లకు సీ టైపు భవనాలు, సీఐఎస్ఎఫ్ భవనాలు తదితర నిర్మా ణాలకు రూ.2.4కోట్లు ఫీజు చెల్లించింది. కొన్ని నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చింది. మిగతా నిర్మాణాలు రెసిడెన్షియల్ జోన్‌లో లేకపోవడంతో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తీసుకోవాలంటూ నోటీసులు ఇ చ్చింది. దీంతో ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మాణ స్థలాలకు సం బంధించి సీఎల్‌యూకు ఫైల్ పెట్టింది. డీ టైపునకు సంబంధించి 8.33ఎకరాలు, హెచ్‌ఓడీ భవనాలకు సంబంధించి 7.98 ఎకరాలు, వీఐపీ గెస్ట్‌హౌస్ 2.07ఎకరాలు, బీ టైపు క్వార్టర్లు 3.21 ఎకరాలకు సీఎల్‌యూకు దరఖాస్తు చేసింది. గత ఏడాది సీఎల్‌యూకు దరఖాస్తు చేయగా డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయం షార్ట్ ఫాల్ ఇచ్చింది. ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు, టోన్సు మ్యాప్‌లు సమర్పించాలని పేర్కొన్నది. మార్చి 19న రామగుండం నగర కమిషనర్ ఆరు నిర్మాణాలకు సంబంధించి అనుమతి లేని భవనాలకు నోటీసులు జారీ చేశారు. దీనిపై స్పందించక పోవడంతో పది రోజుల కాల వ్యవధిపై మార్చి 29న పెనాల్టీ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఆరు భవనాలకు పెనాల్టీ

రామగుండం నగరపాలక సంస్థ ఎన్టీపీసీకి చెందిన అనుమతి లేని ఆరు నిర్మాణంలో ఉన్న భవనాలకు రూ.99.28 కోట్ల పెనాల్టీ నోటీసులు జారీ చేసింది. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం అనుమతి లేని కట్టడాలకు నోటీసులకు కూడా స్పందించకపోతే భవనాలకు సంబంధించి స్థలం, భవనాల విలువను పరిగణలోకి తీసుకుని అపరాధ రుసుము విధిస్తారు. బీ టైపు భవనాలకు రూ.39.61లక్షలు, హెచ్‌ఓడీ బిల్డింగ్‌కు రూ.18.55కోట్లు, టైపు డీ భవనాలకు రూ.27.29కోట్లు, గెస్ట్ హౌస్ బిల్డింగ్‌కు రూ.6.61కోట్లు, ఏసీ రెస్టారెంట్ బిల్డింగ్‌కు రూ.2.35కోట్లు, కమ్యూనిటీ సెంటర్ బిల్డింగ్‌కు రూ.4.83కోట్లు పెనాల్టీ జారీ చేసింది.

ఎన్టీపీసీలో నిర్మిస్తున్న భవనాలు





రేవంత్‌రెడ్డికి రైతన్న, నేతన్న రెండు కళ్లు..

అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతన్న, నేతన్నను రెండు కండ్లుగా చూసుకుంటున్నారని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు రూ.25వేల కోట్లతో రైతన్నకు రుణమాఫీ, రైతు బంధును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నేతన్నల రుణమాఫీ రూ.33 కోట్లతో ఐదు వేల మందికి లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రిని కోరగా, వెంటనే రుణమాఫీ చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రూ.380 కోట్లు బతుకమ్మ చీరల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ద్వారా బకాయిలను విడుదల చేశారన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సంక్షోభాన్ని తీసుకొచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టా లని చూస్తున్నారని ఆరోపించారు. సెస్‌లో గత ప్రభుత్వానికి చెందిన పాలకవర్గం ఉండడం వల్ల ఒత్తిడి తెస్తున్నారన్నారు. బతకమ్మ చీరల స్థానంలో ప్రభుత్వం రూ.680కోట్ల ఆర్డర్లతో కోటి 30 లక్షల చీరలను ఎనిమిది కోట్ల మీటర్ల ఆర్డర్లను తీసుకొచ్చిందన్నారు.

ఈ ఆర్డర్లు సకాలంలో జరగాలంటే విద్యుత్ సదుపాయం ఉండాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల పనులు జరగకుండా సెస్ పాలక వర్గం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. విద్యుత్ బకాయిల పేరుతో మీటర్ వైర్లను కట్ చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సెస్ పాలకవర్గం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికే తాము వచ్చామన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, మురళి, వస్త్ర వ్యాపార సంఘం తాటి పాముల దామోదర్, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గౌడరాజు, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శ ఆంకారపు రవి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

అట్టడుగువర్గాల ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యం

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి


పెద్దలింగాపూర్‌లో సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అట్టడుగువర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, ముస్కానిపేట, జంగమరెడ్డిపల్లె, కందికట్కూర్, రహీంఖాన్‌పేట, వల్లంపట్ల తదితర గ్రామాలలో బుధవారం సన్నపు బియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల మందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు రాఘవరెడ్డి నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు మహేందర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ముత్యం అమర్‌గౌడ్, బత్తిని నారాయణ, మంద బాల్‌రెడ్డి, తూముకుంట రాజేందర్‌రెడ్డి, రవి, ఆనందరెడ్డి, బద్దం హన్మంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రసాద్, విజయ్, అనీల్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోందని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్‌వో వసంతలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. రాచర్లబొప్పాపూర్, పదిర, రాగట్లపల్లి, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లో స్థానిక నాయకులు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మీ, బాబు, గిరిధర్‌రెడ్డి, రాజుకుమార్, శ్రీపాల్‌రెడ్డి, రాములు, గోపాల్, నర్సయ్య, బుచ్చాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంతో పాటు మద్దిమల్ల చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్ బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. తహసీల్దార్ ముక్తార్ పాషా, ఏఎంసీ వైస్‌చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, ఆర్ఐ శివ, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేటలో బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ ప్రారంభించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఏఎంసీ వైస్‌చైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్లు విఠల్, ఎడబోయిన ప్రబాకర్, అజాం, రాజనర్సు, ప్యాక్స్ డైరెక్టర్లు మల్యాల రాజవీర్, రాజేశ్వర్ రావు, రాగుల అంజిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గంగి స్వామి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ గౌరిశంకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గజసింగవరంలోలో కాంగ్రెస్ నాయకులు కొండూరు గాంధీ సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. సముద్రలింగాపూర్‌లో కూడా స్థానిక నాయకులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామచంద్రం, పర్శరాములు, ఎర్ర కిషన్‌గౌడ్, మాజీ సర్పంచ్ పూజం భూమరాజం, నాయకులు తిరుపతి, మారుతి, నాగరాజు, మల్లారెడ్డి, లింగారెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

● రుద్రంగి : మండలంలోని దేగవాత్‌తండా, బడితండా గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నం బియ్యం పంపీణీ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, ఎర్రం గంగనర్సయ్య, జక్కు మోహన్, జక్కు వంశి, గురుదాస్, గంగాధర్ పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : నూకలమర్రి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు పాలకూర్తి పర్శరాములు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, నా యకులు శంకరయ్య, మల్లయ్య, రాజు, మధు, గాంధీ , సుమిత్, గణేష్ , శ్రీను, పర్శరాం, రమలాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని ధర్మారంలో రేషన్ షాపులో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య ప్రారంభించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి గొట్టి రుక్మిణి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, బుర్ర రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంగలి వెంకన్న, నాయిని ప్రభాకర్, రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ, వెలిశాల రవి, తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లోని ఉచిత సన్న బియ్యం పంపిణీని సిరిసిల్ల అధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి మాజీ కౌన్సిలర్ చేన్నమనేని కీర్తికమలాకర్‌రావుతో కలిసి ప్రారంభించారు. జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, ఓబీసీ పట్టణ ఉపాధ్యక్షుడు సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, టౌన్ కాంగ్రెస్ ఉపాధ్య క్షుడు గుగ్గిళ్ల తిరుపతిగౌడ్, ఎస్సీ టౌన్‌ఉపాధ్యక్షుడు ర్యాకం అనిల్, వార్డు అధ్యక్షుడు వంగ ప్రశాంత్, బడుగు భరత్, వార్డుయూత్ అ ధ్యక్షుడు నీరటి శ్యాం, ఉపాధ్యక్షుడు సలేంద్రిరజనీకాంత్, ర్యాకం రమేష్ సల్లూరి సంతోష్, దేవదాస్, సల్లూరి భూమయ్యపాల్గొన్నారు.

ఖజానాకు కళ..

(5వ పేజీ తరువాయి)

రూ.24,70, 871కు వసూలు రూ.24,71,668, ఎల్లారెడ్డిపేట మండలంలో 26 గ్రామపంచాయతీల్లో రూ.1,12,08,799కు రూ.1,12,27,998 పన్నులను వసూలు చేశారు. బకాయిల్లో రూ.9లక్షల 15వేల 390 మిగిలాయి. ఇందులో రెగ్యులర్ బకాయిలు రూ.34,220 ఉండగా, పాత బకాయిలు రూ.8లక్షల 81వేల170 ఉన్నాయి.

● మున్సిపాలిటీల్లో రూ.9.60 కోట్లు వసూలు

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుల వసూలుకు డిమాండ్ మేరకు ముందుకు వెళ్లారు. రెండు మున్సిపాలిటీల్లో రూ.10.39 కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యం కాగా, రూ.9.60 కోట్లు వసూలు చేశారు. ఇందులో సిరిసిల్ల మున్సిపాలిటీలో 23,487 ఇండ్లకు సంబంధించి రూ.6.32 కోట్ల లక్ష్యానికి రూ.6.13 కోట్లతో 96.99శాతంతో ముందంజలో ఉన్నారు. వేములవాడ మున్సిపాలిటీలో రూ.4.07 కోట్ల లక్ష్యం కాగా, రూ.3.47కోట్లు వసూలుచేసి 85.14 శాతంతో నిలిచారు.

జిల్లెల్ల పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో


పాఠశాల విద్యార్థులతో డీఈవో జనార్ధన్‌రావు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు తనిఖీ చేశారు. మధ్యాహ్నా భోజన నిర్వహణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే పాఠశాలలో నిర్వహించిన లిప్ బేస్ లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ రిపోర్టులను పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థులు భాష పైన పట్టు పెంచుకోవాలని, జీవితంలో ఉన్నతంగా ఎగడానికి ఉపాధ్యాయుల సలహాలను స్వీకరించాలని అన్నారు. ఎన్ఎంఎంఎస్ సాధించిన శివతేజ్‌ను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పలువురికి పరామర్శ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వట్టెంల గ్రామంలో ఇటీవల మరణించిన గోలి దేవేందర్, ఎదురుగట్ల గ్రామంలో మరణించిన పొన్నం లత, శాత్రాజ్‌పల్లి గ్రామంలో మృతిచెందిన చిన్న ఎల్లయ్య కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి బధవారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం హన్మాండ్లు, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ వెల్మ బాల్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు..



పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు చేస్తున్నాయని పీసీసీ కోఆర్డినేటర్ అవేజ్‌ఖాన్ ఆరోపించారు. బుధవారం తంగళ్ళపల్లి మండలం బద్దనపల్లి గ్రామంలో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కాంగ్రెస్ శ్రేణులు ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం పాదయాత్రలో మాట్లాడుతూ బీజేపీ పాలనలో రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా పరిపాలన చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందుందని అన్నారు. అలాగే గండిలచ్చపేట గ్రామంలో పాదయాత్ర నిర్వహించి బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగ ట్టారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కోఆర్డినేటర్ చిలుక రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, అనుబంధాల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో పురోహితులు స్వస్తవాచనం, అంకురారోహణం, ధ్వజారోహణం, ప్రధాన కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈనెల 4న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, దేవరెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

వీర్నపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడికి సన్మాన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు ఆయనను సత్కరించారు. అనంతరం రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను పార్టీలు గుర్తించి మంచి స్థానాన్ని కల్పించడం గర్వకారణమన్నారు. వీర్నపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తౌటు అజయ్, బోయిని రవి, వీర్నపల్లి ఎల్లారెడ్డిపేట మండలాల బిజెపి అధ్యక్షులు లక్పతి నాయక్, తిరుపతిరెడ్డి, కులస్తులు పెడతనపల్లి శేఖర్, పిట్ల ముత్యం, తౌటు అంజయ్య, బోయిని లింబయ్య, గుమ్మడి రాజేశం, పిట్ల నాగరాజు, మండేపల్లి రవి, చొప్పరి రాజు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, తదితర గ్రామాల్లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. సర్వాయి పాపన్న పోరాట పటిమతో ముందుకు సాగాలని అన్నారు. పాపన్న తనకు తాను ఆత్మబలి దానం చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్‌గౌడ్, లింగాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నారాయణగౌడ్, సుధాకర్‌గౌడ్, మల్లేశంగౌడ్, పర్శరాములుగౌడ్, కిషన్‌గౌడ్, బాలరాజునర్సాగౌడ్, బాల్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా వైద్యుల క్రికెట్ మ్యాచ్


క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న మహిళా వైద్యులు

వేములవాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ మ్యాచ్ బుధవారం మహిళా వైద్యుల మధ్య ఉత్సాహంగా సాగింది. స్థానిక భీమేశ్వర గార్డెన్‌లోని బాక్స్ క్రికెట్ గ్రౌండ్లో జరిగిన ఈ మ్యాచ్‌లో విజేతలకు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అభిరామ్, ఉపాధ్యక్షులు డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్ ట్రోఫీ అందజేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ లీలశిరీష, రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలు..

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని బుధవారం జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం పది శిక్షణ శిబిరాలను మే 1నుంచి 31వరకు 14 సంవత్సరాల వయస్సు బాలబాలికలకు వివిధ క్రీడలలో శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ శిబిరంలో క్రీడాకులకు శిక్షణ ఇవ్వడానికి ఆసక్తిగల సీనియర్ క్రీడాకారులు, జాతీయ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు వారు సాధించిన ప్రగతి ధ్రువ పత్రాలను జతపరిచి దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షకులకు గౌరవ వేతనం ఉంటుందని శిక్షణకు క్రీడా సామగ్రిని సమకూర్చబడుతుందని ఆసక్తిగల వారు ఈనెల 11న సాయంత్రం 5గంటలలోగా జిల్లా యువజన క్రీడాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని వివరాలకు సెల్ నంబరు 9440239783లో సంప్రదించాలని తెలిపారు.

వృథాగా పోతున్న మిషన్ భగిరథ నీరు



రుద్రంగి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మిషన్ భగీరథ వాట ర్‌ట్యాంక్ సమీపంలో పైపులైన్ పగలడంతో నీరు వృథాగా పోతోంది. రెండు రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సన్న బియ్యంలో కేంద్రం వాటాను ప్రకటించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2 (అంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కేంద్ర ప్రభుత్వం వాటలను ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో సన్న బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేసేందుకు వచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్న బియ్యం పంపిణీ గురించి మాట్లాడకుండా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన కాగితాలను తీసుకవచ్చి మాట్లాడడం సరి కాదని, యూనివర్సిటీకి భూములకు సంబంధించిన సమస్యలుంటే అసెంబ్లీలో చర్చించాలని సూచించారు. ప్రతి సంవత్సరం 10వేల కోట్లు ఖర్చు అయితే ఇందులో 8వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం భరిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 2వేల కోట్లు మాత్రమే భరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే బియ్యం పత్రాలను తీసుకొని ప్రజల ముందుకు రావాలన్నారు. గత బీఆర్ఎస్ గడీలను కూల్చివేసింది బండి సంజయ్‌కుమార్ అని గుర్తు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను వ్యక్తి గతంగా విమర్శిస్తూ సహించేది లేదన్నారు. ఇప్పటికైనా అసత్యపు ప్రచారాలను మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, నాయకులు వంగ అనిల్‌కుమార్, ఉరగొండ రాజు, సదానందం, సిరిసిల్ల వంశీ, రమేష్‌చారీ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలి


కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కూలి రేట్లు పెంచి హమాలీ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ ఆల్ మండల హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏవో రాంరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఎల్లారెడ్డి మాట్లాడుతూ హమాలీ కార్మికుల కూలి రేట్లు క్వింటాల్‌కు రూ. 60 పెంచాలని అన్నారు. గత పది సంవత్సరాల నుంచి కార్మికులకు కూలి రేట్లు జిల్లా వ్యాప్తంగా ఒకే రేట్లు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పది సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హమాలీ కార్మికులకు ప్రభుత్వం తరుపున రూ.12 ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, రూ.12 బంద్ చేయడం వల్ల ఇటు హమాలీ కార్మికులకు రైతులకు కూలి రేట్ల విషయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి వచ్చిందన్నారు. దీనివల్ల ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులతో పనులు చేయించడం వల్ల స్థానికంగా ఉన్న హమాలీ కార్మికులకు కూలీ లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని హమాలీ కార్మికులకు క్వింటాలుకు రూ.60 చొప్పున కూలి నిర్ణయించాలని కోరారు. అన్ని హమాలీ కార్మిక సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తవుడు, మామూలు కూడా ఇప్పించేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు హమాలీ వేల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ఐకేపీ సొసైటీల సెంటర్లలో తాగునీటి, ఫస్ట్ ఎయిడ్ వసతులను కల్పించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఒకే కూలిని నిర్ణయించాలని లేని పక్షంలో పెద్దఎత్తున కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సావనపల్లి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎలిగేటి రాజశేఖర్, జిల్లా నాయకుల మరికట్టి నర్సయ్య, కనుకయ్యలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


చందుర్తిలో ఆందోళన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

చందుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను కోరుతూ చందుర్తి మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ట్రెజరీలలో నిలిచిన 2024 జూలై-డిసెంబర్ వరకు 6 నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా గ్రీన్‌ఛానల్ ద్వారా జనవరి 2025 నుంచి వేతనాలను చెల్లించి, జీవో నం 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలన్నారు. సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. 2వ పీఆర్‌సీని వర్తింపజేసి ప్రస్తుతం ఇస్తున్న వేతనాలను రూ.18వేలకు పెంచాలన్నారు. రూ.10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఏప్రిల్ 19 తరువాత సమస్యల పరిష్కారానికి ఏరోజు నుంచైనా రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు నరేష్, లచయ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలంటూ మండల పరిషత్ కార్యలయంలో ఏంపీడీవో నటరాజ్‌కు మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె నోటీసు అందజేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని, జీవో 51 సవరించి, మల్టీ పర్పస్‌వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతు రాజేశం, నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్ద కేంద్ర ప్రభుత్వ పథకం ఫ్లెక్సీలు..



ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లోని రేషన్ దుకాణాల వద్ద బీజేపీ నాయకులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటం ఉన్న కేంద్ర ప్రభుత్వ పథకం ఫ్లెక్సీలను బుధవారం ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తోందని అన్నారు. ప్రతి రేషన్ దుకాణం ఎదుట పీఎం నరేంద్ర మోదీ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, నరేశ్, వేణు, రవి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా రాష్ట్రానికి సహకరిస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నర్సక్కపేట గ్రామంలోని రేషన్ దుకాణం వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని బుధవారం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు దూది సుధీర్‌రెడ్డి, దారం తిరుపతిరెడ్డి, నీరటి మధు, కాసం మహేష్‌కుమార్, కీర్తి శ్రీనివాస్, బండారి శేఖర్, దూది శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని బంగారు మైసమ్మ తల్లి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 6గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకరణ పూజ, 8 గంటలకు స్వస్తి వచనం, దేవతా ఆహ్వానం, కలశస్థాపన, 10 గంటలకు శ్రీదేవి హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. 11 గంటలకు పూర్ణాహుతి, ఆశీర్వచనం ఇచ్చి భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ దార్ల కీర్తన సందీప్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

గంభీరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. మ్యాజిక్ బస్ సహకారంతో పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.15వేల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్వ్యూలకు డిగ్రీ పూర్తిఅయిన అభ్యర్థులు, ఈ సంవత్సరం ఫైనల్‌ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు 3సెట్స్ జిరాక్స్‌తోపాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. 4న ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటాయని, తరువాత ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సూచించారు.

మాజీ సైనికుడికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ చేసిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన సైనికుడు పంతంగి రవికి బుధవారం మండల కేంద్రంలో యువత, గ్రామస్థులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో అభినందన సభను ఏర్పాటుచేశారు. తండ్రి నర్సయ్య, భార్య కావ్యశ్రీలను సన్మానించారు. నాయబ్ తహసీల్దార్లు గోపాల్, ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

వీర్నపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఉమారాణి ఉద్యోగ పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారాణిని సన్మానించారు. మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వెంగల శ్రీనివాస్, గజన్, కావేరి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతిజాదవ్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, బలరాంనాయక్, మంజుల, శ్రీనివాస్, కవిత, రవి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది..

కోనరావుపేట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మాజీ సర్పంచ్ పురం కన్వీనర్ మంతిని సంతోష్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో వీసీసీ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు వేసవిలో చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులు, యువతకు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కుమ్మరి దేవదాసు, పల్లె రవీందర్‌రెడ్డి, కదిరే పరుశురాంచ, మేకల నరేష్, ఇమ్మానియేల్ పల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.